ఆంధ్రజ్యోతి

andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3၊ కనిష్ఠం 19.0



నిజామాబాద్

జిల్లా వార్తలు

5

శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి రావాలి

● సింగరేణి సీఎండీని ఆహ్వానించిన టీయూ బంజారా సంఘం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో ఈ నెల 21న నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి హాజరు కావాలని గురువారం సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను టీయూ బంజారా సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. సీఎండీని కలిసిన వారిలో బంజారా విద్యార్థి సంఘ నాయకులు శ్రీను రాథోడ్, బీకోజీ, దిగంబర్, గులాబ్, లక్ష్మణ్, రాము, పృథ్వి తదితరులు ఉన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలి

● రాజకీయ పార్టీలను కోరిన అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నిర్వాహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను పరిశీలించి ఏమైనా మార్పులు చేర్పులు అవసరం ఉంటే సూచనలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ రాజకీయ పార్టీలను కోరారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించామన్నారు. ఈనెల 11వ తేదీన జిల్లాలో 31 మండలాలు వాటి పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ముసాయిదా జాబితాను ప్రకటించామని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ పోలింగ్ కేంద్రాల ముసాయిదాను రూపొందించామన్నారు. 31 మండలాల పరిధిలో 307 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని 8లక్షల 51వేల 770 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు మొత్తం 1564 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వీటిలో 400లోపు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 122 ఉండగా, 500లోపు ఓటర్లతో కూడిన పోలింగ్ కేంద్రాలు 362 ఉన్నాయని అన్నారు. 750 వరకు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 1080 ఉన్నాయని, కొత్తగా ఏర్పాటైన మండలాలను కలుపుకొని మొత్తం 31 మండలాలకు గాను ఒక్కో మండలం వారిగా ఎన్ని ఎంపీటీసీ స్థానాలు, ఎంతమంది ఓటర్లు ఉన్నారు అందుకు అనుగుణంగా ఎన్ని పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందనే వివరాలను అదనపు కలెక్టర్ రాజకీయ పార్టీలకు తెలియజేశారు. ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు గాను అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవోలు గురువారం సమావేశాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు వచ్చిన పక్షంలో వాటిని పరిష్కరించి పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్న, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రేమకు ప్రేమతో..

Happy Valentine's Day

- ప్రేమ.. రెండక్షరాలు నూరేళ్ల జీవితం
- ప్రేమ వివాహాలతో ఆదర్శంగా నిలుస్తున్న యువతరం
- నేడు ప్రేమికుల దినం

ప్రేమ.. ఈ రెండక్షరాల పదం చేసే మాయ అంతా ఇంతా కాదు. అందుకే ఇందులోని మాధుర్యాన్ని ఆస్వాదించేందుకు ప్రతి ఒక్కరూ తహతహలాడతారు. ప్రేమను పొందేందుకు అన్నీ వదులుకున్న వారు కొందరైతే.. పెద్దలను ఎదిరించి వివాహ బంధంతో ఒక్కటైన వారు ఇంకొందరు.. విడిపోయి వేరే పెళ్లి చేసుకున్న వారు మరికొందరు.. ఇలా ఎన్నో రకాల కల బోతల సంగమం 'లవ్'.. నేడు వాలంటైన్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ రెండక్షరాలతో మొదలై.. రెండు హృదయాలను కలిపి ఇద్దరి మనుషుల మధ్య ప్రేమను చిగురించి నూరేళ్ల జీవితానికి పునాదిగా నిలుస్తోంది. ప్రేమ ఒక అద్భుతం, అనంతం, రెండు హృదయాలను పెనవేసే ఓ దృఢమైన బంధంగా మారుతోంది. తొలి చూపులోనే మనస్సులు కలుసుకొని ఒక్కటైన వారు కొందరైతే.. చిన్నప్పటి నుంచి స్నేహంగా ఉండి వయస్సు పెరిగే కొద్దీ ప్రేమగా మారి జీవిత భాగస్వాములైన వారు ఎందరో ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రేమికుల రోజు కోసం ఎంతో మంది యువత ఎదురు చూస్తున్నారు. ఆత్మీయులకు తమ ప్రేమను తెలిపే సమయం కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటి వరకు స్నేహితులుగా ఉన్న వారు ఈ రోజున తమ ప్రేమను వ్యక్తపరుస్తూ ప్రేమ బంధంలోకి అడుగు పెట్టేందుకు ప్రేమికుల రోజునే ఎంచుకుంటున్నారు. ఇప్పటికీ పెళ్లి అయిన వారు సైతం ప్రేమికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొనేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు. తరగతి గదుల్లో మొదలైన ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లి తమ బంధాన్ని కొనసాగిస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. ప్రస్తుతం ట్రెండ్ మారినప్పటికీ ప్రేమ అనే రెండక్షరాలకు ఉన్న గొప్పతనం ఇంకా అలాగే ఉంది. కొంత మంది ప్రేమ పేరుతో టీనేజీ లైఫ్‌లో జీవితంలో దారి తప్పుతున్నా.. స్వచ్ఛమైన ప్రేమ ఎప్పటికీ కలకాలం నిలిచి ఉంటుందని ఎంతో మంది నిరూపిస్తున్నారు. ప్రేమ కోసం పెద్దలను ఎదురించి పెళ్లిళ్లు చేసుకున్న వారు కొందరైతే.. పెద్దలను ఒప్పించి పెళ్లిళ్లు చేసుకునే వారు మరి కొందరు.

25 ఏళ్ల క్రితంమే.. పెద్దలను ఎదిరించి..

: బింగి మధు, శోభ (పూసలగల్లి, నిజామాబాద్)

1996లో నగరంలోని పూసలగల్లికి చెందిన బింగి మధుకి మార్వడి గల్లీకి చెందిన శోభకు పరిచయం ఏర్పడింది. 1999లో మాధవనగర్ సాయిబాబా ఆలయంలో జూన్ 19న ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పట్లో సిటీ బస్సుల్లో కాలేజీకి వెళ్లే క్రమంలో రోడ్డుపై తన మిత్రులతో ఉన్న మధును చూసి ప్రేమలో పడిన శోభ ఆమె తల్లిదండ్రులు వద్దన్నా.. మధుని పెళ్లి చేసుకుంది. మూడేళ్ల తర్వాత శోభ తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించారు. పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నప్పటికీ తనకు ఈ 25 ఏళ్ల వివాహ జీవితంలో ఎలాంటి సమస్యలు రాలేదని శోభ తెలిపింది. 25 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం అంటే సమాజం అంతా ఒక వింతగా చూసే రోజుల్లో పెళ్లి చేసుకొని ప్రస్తుతం హ్యాపీగా ఉన్నామని ఇద్దరు పిల్లల్లో ఒక అమ్మాయి జాబ్ చేస్తుండగా అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు.



మతాలు వేరైనా.. పెద్దల అంగీకారంతో పెళ్లి..

: శ్యామ్‌బాబు, తబస్సుమ్ (నిజామాబాద్)

నగరానికి చెందిన ముత్యాల శ్యామ్‌బాబు చిన్నప్పటి నుంచే విద్యార్థి సంఘం నాయకుడిగా పనిచేస్తూ పాఠశాల స్థాయిలో తన క్లాస్‌మేట్‌గా ఉన్న ఫాతిమా తబస్సుమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. చిన్నప్పటి నుంచి డిగ్రీ వరకు కలిసి చదువుకొని తమ అభిప్రాయాలు కలవడం వల్ల ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పదేళ్ల పాటు తల్లిదండ్రులను ఒప్పించి కుల మతాలకు అతీతంగా అందరినీ గౌరవిస్తూ ఇరు మతాల సాంప్రదాయాలను గౌరవిస్తూ ప్రస్తుతం కులం, మతం లేకుండా అటువంటి ప్రస్థావన లేకుండా సంతోషంగా జీవిస్తున్నారు. ప్రస్తుతం న్యాయవాదిగా, మానవహక్కుల సంఘం రాష్ట్ర ప్రతినిధిగా శ్యామ్‌బాబు పనిచేస్తుంటే ప్రభుత్వ ఉద్యోగిగా తబస్సుమ్ పనిచేస్తుంది. ప్రేమ వివాహం చేసుకోవడం ఒక మధురానుభూతి అని జీవితాంతం సుఖసంతోషాలతో ఉండాలంటే సరైన వయస్సు, పరిపక్వత, తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటే అందరూ సుఖసంతోషాలతో ఉండవచ్చునని వారు తెలిపారు.



ఇంటర్‌లో ఏర్పడిన పరిచయం.. ప్రేమగా మారింది..

: మహేష్, దీప (ఆర్మూర్)



ఇంటర్మీడియేట్‌లో మొదటి సంవత్సరంలో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇంటర్ పూర్తి కాగానే స్నేహితుల సహకారంతో 1997లో ప్రేమ వివాహం చేసుకున్నాం. ఇప్పటికీ 28ఏళ్లు కావస్తున్నాయి. ఆర్మూర్‌లోని డిగ్రీ పీజీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా పని చేస్తున్నాను. సుమారు 28ఏళ్ల కాపురం ప్రేమగా సజావుగా సాగుతోంది. మాకు ఇద్దరు పిల్లలు. కూతురు ఎంబీఏ చదువుతుండగా, కుమారుడు 9వ తరగతి చదువుతున్నాడు ఇద్దరి మధ్య సఖ్యత, అర్థం చేసుకునే ఓపిక ఉంటే ప్రేమ పెళ్లిళ్లు విజయవంతమవుతాయి. తల్లిదండ్రులను వదిలి మన కోసం వచ్చిన వారికి కష్టసుఖాల్లో అండగా ఉంటామన్న నమ్మకం కలిగించాలి. ప్రేమతో చూసుకుంటే ప్రేమ పెళ్లిళ్లు సజావుగా సాగుతాయి.

రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మధ్య అగాథం

వరంగల్ పర్యటన రద్దుతో తెలిసిపోయింది : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మధ్య అగాథం ఏర్పడిందని వరంగల్ పర్యటన రద్దుతో తేలిపోయిందని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వరంగల్‌లో ఎన్నికల హామీలో భాగంగా రైతు డిక్లరేషన్‌లో ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని ప్రజలకు మొఖం చూపించలేకనే రాహుల్‌గాంధీ వరంగల్‌కు రాలేదన్నారు. అంతేకాకుండా రేవంత్‌రెడ్డి మొఖం చూడలేకనే రాహుల్‌గాంధీ వరంగల్ సభను రద్దు చేసుకున్నాడని అన్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలు ఇద్దరూ ఐరన్ లెగ్గులేనని అన్నారు. వీరిద్దరి హయాంలో అనేక రాష్ట్రాల్లో జీరో సీట్లు వచ్చాయని అన్నారు. రేవంత్‌రెడ్డి కులగణన పట్టుకొని ఢిల్లీకి పోతే రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదన్నారు. రేవంత్‌రెడ్డి పదవి ఉంటుందో లేదో తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఠాలుగా విడిపోతుందని అన్నారు. కొన్ని రోజుల క్రితం 11 మంది ఎమ్మెల్యేలు సమావేశం ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో రీ సర్వేలు చేయడం కాదని రీ ఎలక్షన్‌లు జరగాలన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రజలు డిమాండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాంకిషన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సూదం రవిచందర్, మస్త ప్రభాకర్, నందిపేట్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, దేవేందర్, సదానంద్, చింతకాయల రాజు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

కుంభమేళాకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

- కారును ఓవర్ టేక్ చేసి.. సడెన్ బ్రేక్ వేసిన లారీ డ్రైవర్
- వాహనం అదుపుకాక లారీ కిందకు చొచ్చుకెళ్లిన కారు
- ఒకరి మృతి.. మరో ఐదుగురికి గాయాలు

ముప్కాల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన వనం సంపత్‌రాణా(26), పోతు రమేష్, చంద్రశేఖర్‌చారి, వనం శ్రీనివాస్, రజనీకాంత్, పోతు సాయి విశాల్‌లు స్నేహితులు. వీరంతా కలిసి గురువారం తెల్లవారుజామున కారులో (టీఎస్7ఏపీ8899) ఉత్తర ప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు బయలుదేరారు. మార్గమధ్యలో బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామ ఎక్స్‌రోడ్డు వద్దకు రాగానే మహారాష్ట్రకు చెందిన లారీ వీరి కారును ఓవర్ టేక్ చేసింది. ఆ తర్వాత లారీ డ్రైవర్ వాహనాన్ని ఎడమ వైపునకు తీసుకొని ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో.. వెనకాలే ఉన్న కారు అతి వేగంతో అదుపు తప్పి లారీ కిందకు చొచ్చుకెళ్లింది. ఈ ఘటనలో సంపత్ రాణా అక్కడికక్కడే మృతి చెందగా.. కారులో ఉన్న మరో ఐదుగురు యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని వెంటనే నిర్మల్‌లోని ఆస్పత్రికి తరలించారు. కాగా.. ప్రమా దానికి కారణమైన లారీ డ్రైవర్ కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

గల్ఫ్ కార్మికుల వలసలపై అధ్యయనం

- జిల్లాలోని నాలుగు గ్రామాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు
- జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు భారీగా వలస వెళ్లిన కార్మికులు



న్యావనందిలో మాట్లాడుతున్న ఐక్యరాజ్యసమితి అనుబంధ సంఘాల ప్రతినిధులు

నిజామాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/సిరికొండ: జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులపై ఐక్య రాజ్య సమితి అనుబంధ సంస్థలు దృష్టి పెట్టాయి. వారి స్థితిగతులు తెలు సుకునేందుకు జిల్లాలోని రెండు మండలాల పరిధిలోని నాలుగు గ్రామాల్లో రెండేళ్ల పాటు అధ్యయనం చేయనున్నాయి. గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించే శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి పొందే విధంగా చేసేందుకు ఈ సంస్థలు పనిచే యనున్నాయి. రాష్ట్రంలో ఈ జిల్లా నుంచే గల్ఫ్‌కు ఎక్కువ మంది కార్మికులు వెళ్తుండటంతో ప్రయోగాత్మకంగా ఆ సంస్థలు ఈ గ్రామాలను ఎంపిక చేశాయి. ఈ గ్రామాల్లో అన్ని పరిస్థితులను పరిశీలించడంతో పాటు గల్ఫ్‌కు వెళ్లే యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. గల్ఫ్ నుంచి తిరిగి వచ్చిన వారికి ఇక్కడ ఉపాధి పొందేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలలో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఈ సంస్థల ప్రతినిధులు జిల్లాకు రావడంతో పాటు ఆ నాలుగు గ్రామాలలో పర్యటించాయి. ధర్పల్లి మండలంలోని ఒన్నాజీపేట, దుబ్బాక, సిరికొండ మండలం మైలారం, న్యావనంది గ్రామాల్లో గురువారం సంస్థ ప్రతినిధులు పర్యటించారు. అక్కడి గ్రామ కార్యదర్శులు, ప్రజలను కలవడంతో పాటు గల్ఫ్ కార్మికుల స్థితిగతులపై ఆరా తీశారు. ఈ నాలుగు గ్రామాల పరిధిలో ఎంతమంది గల్ఫ్‌కు వెళ్లారు. ఏఏ దేశాలకు వీరు పనిచేస్తున్నారో గ్రామ కార్యదర్శులతో పాటు గ్రామస్తులతో చర్చించి వివరాలను తెలుసుకున్నారు. వలస కార్మికుల నిపుణురాలు డాక్టర్ సిస్టర్ లీజీ జోసెఫ్, మంద భీమ్‌రెడ్డి, చేగంటి మోహన్‌లతో పాటు ఇతర సభ్యులు ఈ గ్రామాలను పర్యటించారు. ఈ సంస్థల ఆధ్వర్యంలో చేపట్టే పనులను గ్రామస్థులకు వివరించారు. సిరికొండ మండలం న్యావనందిలో ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కూడా కలిసి చేపట్టే పనులను వివరించారు.

మిగతా 8వ పేజీలో...

యథేచ్ఛగా ఇసుక రవాణా!



● కొడిచర్లలో ఇసుక డంప్‌ను సీజ్ చేసిన తహసీల్దార్

- జిల్లాలో రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- పలుచోట్ల ఆగని ఇసుక అక్రమ సరఫరా
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

రుద్రూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమార్కులు ఇసుక దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. పొతంగల్ గ్రామ శివారులోని మంజీరా నది, సుంకిని, కొడిచర్ల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా రవాణా చేస్తున్నారు. టిఎస్16ఈఎన్7909, టీజీ16 1422 ట్రాక్టర్లకు వే బిల్లు పత్రంలో ఉదయం 10.20 గంటల నుంచి మధ్యాహ్నం 12.20 వరకు సమయం ఉంటే సాయంత్రం 6.30 సమయంలో కూడా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట పర్మిషన్ ముసుగులో ఒక్కో వే బిల్లుపై ఏడెనిమిది ఇసుక ట్రాక్టర్లను తరలిస్తున్నారని, వ్యాపారులు రహస్య ప్రాంతంలో ఇసుకను డంప్ చేసి రాత్రి వేళల్లో రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారని పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



మోర్తాడ్ శివారులో పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మోర్తాడ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్ పెద్దవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఏఎస్సై గోపాల్, కానిస్టేబుల్ సంపత్ పట్టుకున్నారు. గురువారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై విక్రం తెలిపారు.

కొడిచర్లలో 38 ట్రాక్టర్ల ఇసుక డంపులు సీజ్

కోటగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో గురువారం 38 ట్రాక్టర్ల ఇసుక డంపులను తహసీల్దార్ గంగాధర్ సీజ్ చేశారు. గ్రామంలో ఇసుకను అక్రమంగా డంపు చేసినట్లు సమాచారం రావడంతో ఇసుక నిల్వలను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పనుల కోసం, ఇంటి నిర్మాణాల కోసం కేటాయిస్తామన్నారు. అవసరమైన వారు డీడీలు కడితే ఇసుక రవాణాకు అనుమతిస్తామన్నారు ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రామన్నపేట్‌లో మహిళా సంఘ సభ్యురాలికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

వేల్పూర్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ సబ్సిడీ రుణాలను మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీఏపీ ఎం బత్తుల మాణిక్యం అన్నారు. వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామ మహిళ సంఘం ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కొరకు వెన్నల మహిళ సంఘం సభ్యురాలు కుంబాజి తిరుమలకు రూ.లక్ష 50వేల మంజూరైన చెక్కును తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అందజేశారు. ఈసందర్భంగా ఏపీఎం మాణిక్యం మాట్లాడుతూ పీఎంఎఫ్ఎం ద్వారా మంజూరైన ఈ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ రోజు సభ్యు రాలు తిరుమలకు పిండి గిర్ని ఏర్పాటు కొరకు రూ.లక్ష 50వేల చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, చంద్రకాంత్‌రెడ్డి, సీసీలు ప్రకాశం,సాయన్న, గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాలు, వీవోఏలు మాణిక్‌రావు, కవిత, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జుక్కల్, ఫిబ్రవరి 13: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అభివృద్ధి చేయడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని రైతు నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో కందులు పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలల్లో కందులు క్వింటాలు మద్దతు ధర రూ. 7,550 ప్రభుత్వం ధర ప్రకటించిందని ఆయన అన్నారు. కందులు పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని ఆయన సూచించారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి



మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో గురువారం మాజీగవర్నర్, రాజకీయవేత్త, రచయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని సరోజిని నాయుడు గ్రహించి ప్రతీ గ్రామాలలో తిరగుతూ మహిళలను చైతన్యపర్చిందని బ్రిటిష్ వారిని సైతం బెదిరించి స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి జైలు శిక్షను అనుభవించిన వీరనారి అని కొనియాడారు. స్వతంత్యం వచ్చిన అనంతరం సరోజిని నాయుడు సేవలను గుర్తించి అప్పటి ప్రభుత్వం గవర్నర్‌గా నియమించి జాతీయ మహిళ దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళ కానిస్టేబుళ్ళను శాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పొల్కం వేణు, రీజియన్ చైర్మన్ డికె.రాజేష్, జోన్‌చైర్మన్ చేపూర్ గణేష్‌అశోక్, ప్రకాష్, నివేదన్, అల్జాపూర్ రాజేష్, గోపి పాల్గొన్నారు.

మత్తుపదార్థాలను అరికట్టేందుకు కృషి



ఎస్సై మహేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమ్‌గల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో మత్తుపదార్థాల నిరోధానికి సర్వసమాజ్ ఆధ్వర్యంలో నిరంతరం పని చేస్తా మని అధ్యక్షుడు నీలం రవి తెలిపారు. ఈ మేరకు ఎస్సై మహేష్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. మత్తు పదార్థాలన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖ చేస్తున్న కృషికి సర్వసమాజ్ ఆధ్వర్యంలో అండగా ఉంటామని, పోలీస్‌శాఖ కూడా సలహాయ సహకారాలు అందజేయాలని కోరారు. మత్తు పదార్థాలు, పేకాట లాంటి అసాంఘీక కార్యకలాపాల వల్ల బంగారు భవిష్యత్‌ను నశనం చేసుకుంటు న్నారని కనుక వీటిని అరికట్టేందుకు తగు చర్య లు తీసుకోవాలని ఎస్సైని కోరారు.

అర్గుల్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు ప్రారంభం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో వేంక టేశ్వరస్వామి ఆలయ జాతర, బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం తీర్థప్రసాదం వితరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సుప్రభాతం, అగ్నిప్రతిష్ఠ, నిత్య హోమం, ధ్వజారోహణం, 15న స్వామివారి కల్యాణం, 16న సాముహిక కుంకుమార్చన, దొంగల దోపు, 17న స్వామివారి రథోత్సవం, 18న చక్రతీర్థం, 19న స్వామివారి నాగవెల్లితో జాతర ఉత్వవాలు ముగుస్తాయని పండితులు ఆచార్యతేజ చక్రవర్తులు తెలిపారు. జాతర ఉత్స వాల సందర్భంగా వచ్చే భక్తుల కోసం వీడీసీసభ్యులు ఏర్పాట్లు చేశారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి



బాలుడు సాయిరాం మృతదేహం

కోటగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మంజీరా నదిలో చేపల వేటకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన పొతంగల్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొతంగల్ గ్రామానికి చెందిన సాయిరాం(17) మంజీరా నదిలో బుధవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయిరాం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మంజీరా నదికి వెళ్లి వెతికారు. నది ఒడ్డున సాయిరాం దుస్తువులు, చెప్పులు కనబడడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు జాలరుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా గురువారం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రామన్నపేట్‌లో ఈసీబీని ప్రారంభించిన జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ

వేల్పూర్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా అమార్చబడిన ఈసీబీ ద్వారా విద్యుత్ సరఫరాను గురువారం జిల్లా విద్యుత్ ఎస్ఈ రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఏటువంటి అంతరాయం లేకుండా విని యోగదారులకు సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ సరఫరాలో ఏమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు రైతులు, ఇతర వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. విద్యుత్ వాడకాన్ని పొదుపుగా వాడుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ అధికారి డీఈ రాజేశ్వర్‌రావు, ఏడీఈ లోకనాథ్‌రెడ్డి, మోర్తాడ్ ఏఈ గంగాధర్, ఎల్ఐ మల్లికార్జున్, లైన్‌మెన్ సతీష్‌కుమార్, విద్యుత్ సిబ్బంది, స్థానిక గ్రామకమిటీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌లో ఈసీబీని ప్రారంభిస్తున్న జిల్లా విద్యుత్ ఎస్ఈ రవీందర్

కామ్రేడ్ యాదగిరి సంతాప సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



జక్రాన్‌పల్లిలో గోడప్రతులను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

వేల్పూర్,, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) ఆధ్వర్యంలో గురువారం కామ్రేడ్ యాదగిరి సంతాప సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 17న నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఉదయం 11గంటలకు జరిగే కామ్రేడ్ యాదగిరి సంతాప సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విప్లవ జోహర్లు అర్పించాలని ప్రజాపంథ నాయకులు జి.అర్వింద్, వి.రమేష్‌లు కోరారు. కామ్రేడ్ డివి.కృష్ణ, కామ్రేడ్ నారాయణతో కలిసి జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు చర్చిస్తూ విప్లవ రాజకీయాల వైపు యాదగిరన్న మారాడన్నారు. విప్లవ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవిస్తూ చివరిశ్వాసను వదిలిన కామ్రేడ్ యాదగిరి అన్న సంతాప సభకు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ ఫ్యాకర్స్ గంగాధర్, లింబాద్రి, అన్వర్, అనంద్, అజేందర్, సాయన్న, పద్మ, హేమలత, జ్యోతి, కావేరి, స్రవంతి, మురళీ, రమేష్, జగదీష్, ఎడ్లన్న, తదితరులు పాల్గొన్నారు.

● జక్రాన్‌పల్లిలో కామ్రేడ్ యాదగిరి సంతాప సభ గోడప్రతుల ఆవిష్కరణ

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):జక్రాన్‌పల్లిలో ఆదర్శ కమ్యూనిటీ యాదగిరి సంతాప సభ గోడప్రతులను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 17న నిజామాబాద్ జిల్లాలో జరిగే సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) సబ్‌డివిజన్ కార్యదర్శి కిషన్, మండల పీడీఎస్‌యూ అధ్యక్షుడు అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్ కమిటీ నాయకులు గంగాధర్, మోహన్, ప్రసాద్, మమత, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు ఆలయ పూజారికి పరామర్శ



చిలుకూరి ఆలయ పూజారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చిలుకూరు ఆలయ పూజారి రంగరాజన్‌ను గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరా మర్శించారు.ఇటీవల రాజరాజన్‌పై జరిగిన దాడి సంఘటనను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ఇలాంటి దాడులను ఊపేక్షించేదిలేదని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలు, పూజారులపై దాడులకు పాల్పడడం బాధా కరమన్నారు. ఇలాంటి ఘటనలకు బీజేపీ వ్యతిరేకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

సాలూర,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు అదుపు తప్పిపంట పొలాల్లోకి ట్రాక్టర్ దూసుకెళ్లిన సంఘటన గురువారం సాలూర క్యాంప్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. సాలూర గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ అవసరాల నిమిత్తం ట్రాక్టర్‌ను తీసుకుని గురువారం బోధన్ వైపు వస్తుండగా సాలూర క్యాంప్ వద్ద అదుపు తప్పి పంట పొలాల్లోకి ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ దూసుకెళ్లిందన్నారు. ఈ ఘటన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడం వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. డ్రైవర్‌కు కూడా ఎటువంటి గాయాలు కాకుండా బయట పడ్డాడు. అనంతరం క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌తో పాటు ట్రాలీని బయటకు తీశారు. రోడ్డు విస్తరణలో భాగంగా కొత్త రోడ్డు నిర్మించారు. ఎటువంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత శాఖ అధికారులు వెంటనే సూచిక బోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు డిజిటల్ స్కిల్‌పై అవగాహన

ఆర్మూర్‌రూరల్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. డిజిటల్ ఈక్విటీ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఈమెయిల్ ఐడి క్రియేట్ చేయడం, గుగుల్ టూల్స్, గుగుల్ ఫర్ ఇఫార్మేషన్, ఇంటర్నేట్ ఎథిక్స్ అండ్ సెక్యూరిటీ గుగుల్ డాక్యూమెంట్స్,గూగుల్‌సీట్స్,స్లైడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్ర మంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు జీవీఎస్.చారి, రాజ్‌కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు దుస్తుల అందజేత

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో శుభోదయం పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు గురువారం కొలిప్యాక్ సింగిల్‌విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ స్కూల్ దుస్తులు పంపిణీ చేశారు. చింతలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గేదె మృతి

ఆర్మూర్‌రూరల్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లో గురువారం కుక్కలు దాడి చేసిన ఘటనలో గేదే (దూడ) మృతి చెందింది. మామిడిపల్లికి చెందిన నీరడి రాజా తన గేదెను కొట్టంలో కట్టివేసి ఉంచగా కుక్కలు దాడి చేసి కరవడంతో గేదే మృతి చెందింది. వారం రోజుల క్రితం ఆర్మూర్ పట్టణంలో కుక్కల దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కుక్కలను నియంత్రించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి 33/11సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్ వద్ద 33కేవీ లైన్ పనులు జరుగుతున్నందున జన్నేపల్లి, నాడాపూర్, గాంధీనగర్, సిరన్‌పల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఆయన వివరించారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఈ విషయంలో వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

ముప్కాల్‌లో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ముప్కాల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో శుక్రవారం ఉదయం 10గంల నుంచి 1గంట వరకు వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక ఏర్పాటు చేయనున్నట్లు ముప్కాల్ విద్యుత్ ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్, అధికారులు పాల్గొంటారని కావున విద్యుత్ వినియోగదారులు సమస్య ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో చెట్టు నరికివేత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో నీడను ఇచ్చే చెట్టును నరికి వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ ఎదురుగా పెద్ద వేప చెట్టును గురువారం నరికి వేశారు. ఈ సందర్భంగా వైద్యులను వివరణ కోరగా చెట్టుపై ఉన్న కొమ్మలు ఆక్సిజన్ ప్లాంట్‌కు కరెంట్ వైర్లకు, ఇతర విభాగాలకు అడ్డుగా వస్తున్నాయని, చెట్టుపై ఉన్న కొమ్మలను మాత్రమే నరికామని చెప్పడం జరిగిందని వైద్యులు తెలిపారు. కాని చెట్లు నరికే వారుపై కొమ్మలతో పాటు పెద్ద మొత్తంలో చెట్టును నరికివేశారన్నారు. నీడను ఇచ్చే చెట్టును నరకడం బాధగా ఉందని సంబంధిత అధికారులకు తెలియజేశామన్నారు.సగం నరికిన చెట్టును మళ్లీపెరిగేలా చర్యలు చేపడతామని ఇన్‌చార్జి సూపరిండెంట్ తెలిపారు.



బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో నరికిన చెట్టు దృశ్యం

అధికారులకు ఎన్నికల శిక్షణ కార్యక్రమం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆర్మూర్ డివిజన్ పరిధిలోని అధికారులకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎల్‌పీవో శివకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో నామినేషన్ పత్రాల స్వీకారణ విధానం, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం, అధికారులు, తదిత రులు పాల్గొన్నారు.

మునిపల్లిలో బాధిత కుటుంబానికి పరామర్శ



మాజీ డీసీఎంఎస్‌చైర్మన్ సాయిరెడ్డిని, మాజీసర్పంచ్ చిన్నసాయిరెడ్డిని పరామర్శిస్తున్న తాహెర్‌బిన్‌హందాన్

జక్రాన్‌పల్లి,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):మండలంలోని మునిపల్లి గ్రామంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మాజీసర్పంచ్ ఎం.చిన్నసాయిరెడ్డిని గు రువారం రాష్ట్ర ఉర్దూఅకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ పరామర్శించారు. ఇటీవల తాజామాజీసర్పంచ్ ఎం.చిన్నసాయిరెడ్డి తండ్రి ముస్కు బొర్రన్న గుండె పోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబసభ్యులను రాష్ట్ర ఊర్దు అకాడమి చైర్మన్ పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో మాజీవైస్‌ఎంపీపీ తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కాలుజారి ఒకరి మృతి

కోటగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో ప్రమాదవశాత్తు కాలుజారి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని హెగ్డోలి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోన్ కాంబ్లే రమేష్ (35) ఉదయం ఇంటి నుండి వ్యవసాయ భూమిలో మందు చల్లడానికి వెళ్లాడు. తిరిగి రాకపోయే సరికి పొలానికి వెళ్లి చూడగా బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. మందుల బస్తా ఎత్తుకొని వ్యవసాయ ఒడ్డుపై నడుచుకుంటూ వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందినట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

మంత్రాల నెపంతో మహిళపై దాడి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామానికి చెందిన ఎల్లవ్వ అనే మహిళను కొందరు వ్యక్తులు మంత్రాలు చేస్తున్నారనే నెపంతో గురువారం బూతులు తిడుతూ చేతులతో కొట్టారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బాధితురాలు ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. తనకు ఎలాంటి మంత్రాలు రావని కొందరు దురుద్దేశంతో తనపై నిరాదరణ ఆరోపణలు చేస్తున్నారని ఆమె పేర్కొన్నారని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మద్యం తాగి వాహనం నడిపించిన వ్యక్తిని గురువారం కోర్టు న్యాయాధికారి శేషతల్ప సాయి ముందు హాజరుపర్చగా మద్యం తాగి డ్రైవ్ చేసిన వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలలో ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి: మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4, 5 తేదీలలో మద్యం తాగి వాహనాలను నడిపించిన ఇద్దరు వ్యక్తులను గురువారం రెండో తరగతి జ్యుడిషియల్ న్యాయాధికారి శేష తల్పసాయి ముందు హాజరు పరుచగా వారిద్దరికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

విద్యాశాఖ మంత్రిని నియమించండి



డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్, ఏరియా అధ్యక్షుడు నిఖిల్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యతిరేక విధానాల గురించి ప్రతీ క్లాసుకు తిరిగి వివరించారు. రాబోయే బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30శాతం నిధులను కేటాయించాలని, యూనివర్సిటీలో అభివృద్ధి నిధులు కేటాయిస్తూ ప్రతీ యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యరంగ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మమత, వినోద్, సిద్దు సాయిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



అబాకస్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని శ్రీబాషిత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తెలిపారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన అబాకస్ పోటీలలో స్టార్ జూనియర్ లెవల్-1లో బెస్ట్ ఫర్ఫర్మర్‌గా శైలేంద్ర, జూనియర్ లెవల్-1లో స్టార్ ఫర్ఫర్మర్‌గా భూమేష్‌చంద్ర విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబాకస్ ద్వారా విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంపొందింప జేస్తుం దని, గణితం సబ్జెక్టు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడానికి అబాకస్ ఉపయో గపడుతుందన్నారు.

లయన్స్‌క్లబ్‌ను సందర్శించిన డిస్ట్రిక్ గవర్నర్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్‌ను గురువారం లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ నగేష్ పంపాటి సందర్శించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్‌లు చేయడంతో లయన్స్‌క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, శ్రీధర్, నర్సింహరాజు, జగదీశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, శ్రీకాంత్, నారాయణగౌడ్‌లు పాల్గొన్నారు.

తడిపొడి చెత్తపై మహిళలకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో గురువారం మున్సిపల్ అధికారులు తడిపొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు తడిపొడి హానికరమైన చెత్తను విభజించి మున్సిపల్ వాహనానికి అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, జూనియర్ అసిస్టెంట్ రాజయ్య, వార్డు ఆఫీసర్ సింధూజ, ఆర్‌పీ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో అవినీతిపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయంలో జరుగుతున్న అవినీతిపై రాష్ట్ర దేవాదాయ , ధర్మదాయ శాఖ కమిషనర్‌కు గురువారం శివసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీహరి పన్నంవార్, అర్చకుడు నర్సింగ్‌రావులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.గత కొంత కాలంగా జంబి హనుమాన్ ఆలయంలో అవినీతి అక్రమాలతో పాటు దొంగతనాలు జరుగుతున్నాయని, దేవాలయానికి వచ్చే చందాల్లో చేతివాటం చూపుతున్నామని, ఎండోమెంట్ అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించకుండా అవినీతికి పాల్పడుతున్న అటెండర్‌కు వత్తాసు పలుకుతున్నారని, ఆలయ పూజారి పట్ల ఈవో దురుసుగా ప్రవర్తిస్తూ విధుల నుంచి తొలగించడంలో ఆంతర్యమేమిటోనని ఎండోమెంట్ అధికారుల పనితీరుపై శాఖపరమైన చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేల్పూర్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగారం వెంకయ్య(65) అనే వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం వెంకటాపూర్ నుంచి వెంకయ్య బైక్‌పై వేల్పూర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వేల్పూర్ రైస్‌మిల్ సమీపంలో బీటీరోడ్డుపై అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు, ముఖంపై బలమైన గాయాలు కావడంతో వెంకయ్యను ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా గురువారం ఆయన మరణించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్లాస్టిక్‌పై దుకాణాలలో తనిఖీ



దుకాణ యాజమానికి జరిమానా విధిస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు దుకాణాలలో గురువారం మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని బేకరి, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్, హోటళ్లలో తనిఖీ నిర్వహించి శుభ్రత పాటించని నాణ్యత లేని ప్లాస్టిక్ వాడుతున్న దుకాణా యాజమానులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, రాజయ్య, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో కుంటలో పడి ఒకరి మృతి



ముత్తెన్న (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వరగుట్ట కింద కుంటలో పడి తిర్మన్‌పల్లి ముత్తెన్న(60) మృతి చెంది నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మద్యానికి బానిసై మతి స్థిమితి సరిగ్గా లేక సోమవారం ఇంటి నుంచి వెళ్లిన ముత్తెన్న గురువారం మొరం కోసం తవ్విన కుంటలో పడి శవమై తేలాడు. భార్య గంగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారా యణ తెలిపారు.


సీతరాముల వనవిహారంలో పూజలందుకుంటున్న స్వామి వారు

ఘనంగా సీతారాముల వన విహారం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సీతా రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వన విహారం, (జాతర), చక్రతీర్థం కార్యక్రమాలను అంగడీ మామూళ్లలో ఘనంగా జరిగాయి. జాతరలో దుకాణ సమూదాయాలు రోడ్డుకు ఇరువైపులా వెలిశాయి. దీంతో దుకాణాలలో కొనుగోలు దారులతో కిక్కిరిసి పోయాయి. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం పొద్దుటూరి సమత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన లాల్ బహదూర్ యూత్ పానకం ప్రసాదం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఖిల్లా డిచ్‌పల్లితో పాటు జిల్లా నలు మూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.


జాతరలో దుకాణాలు

నేడు నాగవెళ్లి

సీతారాముల కల్యాణ బ్రహోత్సవాల్లో భాగంగా నేడు ఆలయ ప్రాంగణంలో మాగ శుద్ధ విదియ శుక్రవారం నాగవెళ్లి కార్యక్రమం వైభవోపేతంగా జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య తెలిపారు. అనంతరం పుష్పయాగం, ఉద్వసన బలి, మంత్ర పుష్పం, ఏకాంత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావలిని ఆయన కోరారు.

ఏర్గట్లలో కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం



ఏర్గట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పది గంటలకు స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రథోత్సవానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పా ల్గొని రథోత్సవం తిలకించారు. గురువారం ఆలయం వద్ద జాతర అన్నధాన కార్య క్రమాలు నిర్వహించగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రా మాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మండలంలోని భక్తులు పాల్గొన్నారు.

మేత కోసం కోసుల దూరం

● గొర్రెలతో వందల కిలోమీటర్లు వలస వస్తున్న కాపరులు
● మెదక్ జిల్లా నుంచి కామారెడ్డి జిల్లాకు రాక

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తర్వాత ఉపాధి చూపే రంగం పశుపోషణ. పశుపోషణపై ఆధారపడి జిల్లాలో వందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పశుపోషణలో భాగంగా జిల్లాలోని కుటుంబాలు గేదేలు, మేకలు, గొర్రెలు వంటి వాటిని పోషిస్తుంటారు. వర్షాకాలంలో జీవాలకు మేత విరివిగా లభించిన ఖరీఫ్ పంటలు పూర్తయిన తర్వాత కొన్ని ప్రాంతాలలో మేత లభించదు. దీంతో వాటి యజమానులు తమ జీవాలను తీసుకుని మేత, నీరు దొరికే ప్రాంతాలకు వలస వెల్తారు. సుమారు ఆరు నెలల పాటు జీవాలకు వివిధ గ్రామాల్లో మేత కోసం తిప్పుతూ తమ ప్రాంతాల్లో వర్షం కురిసి మేత పడ్డ తర్వాత తమ సొంత గ్రామాలకు వెళ్తారు. అప్పటి వరకు ఆరు నెలల పాటు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ జీవాలను సాదుకుంటారు. తమ పిల్లపాపల మాదిరిగా జీవాలను సాదుకుని ఆరు నెలల తర్వాత తమ ఇళ్లకు చేరుకుంటారు.

వందల కిలోమీటర్ల మేర జీవాలతో వలస..

ప్రతి సంవత్సరం జుక్కల్, బాన్సువాడ నియోజక వర్గాలలోని వివిధ గ్రామాలకు పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన గొర్రెల మందలు వలస వచ్చేవి. అవి కూడా ఈ ప్రాంతంలో రబీ పంటలు పూర్తయిన తర్వాత వలస వచ్చేవి. అయితే ఈ సారి మాత్రం జిల్లాలోని దోమకొండ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గొర్రెల మందతో పాటు మెదక్ జిల్లా రామాయంపేట్ మండలంలోని గ్రామాలకు చెందిన గొర్రెలు కూడా ఈ సారి ముందుగానే జుక్కల్ ప్రాంతానికి వలస వచ్చాయి. దోమకొండ నుంచి జుక్కల్ నియోజక వర్గంతో పాటు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు గొర్రెల మందలు వలసవచ్చాయి. వందల కిలో మీటర్ల మేర జీవాలు మేత కోసం తరలివస్తున్నాయి.


వంట కోసం సామాగ్రి గుర్రంపై వేసి తీసుకవస్తున్న దృశ్యం

ఆరు నెలల పాటు కుటుంబాలకు దూరంగా..

గొర్రెల యజమానులు తమ ప్రాంతంలో జీవాలకు సరైన మేత లభించకపోవడంతో ఖరీఫ్ పంటలు పూర్తి కాగానే మేత కోసం ఆరు నెలల పాటు మేత లభించే ప్రాంతాలకు వలస వెళ్తారు. ఖరీఫ్‌లో వరి పంట పూర్తి కాగానే ఆ ప్రాంతంలో జీవాలకు మేత దొరకదు. జుక్కల్ నియోజక వర్గంలోని పెద్ద కొడప్‌గల్, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, డోంగ్లి మండలాల్లో రబీ పంట కింద శనగ, జొన్న లాంటి పంటలను వేస్తారు. అవన్నీ ప్రస్తుతం కోత దశకు చేరుకోవడంతో ఈ ప్రాంతంలో గొర్రెలకు మేత లభిస్తుండటంతో ఇతర ప్రాంతాల వారు తమ మందలను తీసుకుని ఇక్కడికి వలస వస్తారు. రోజంతా ఆయా ప్రాంతాలలో మేత కోసం గొర్రెలను తిప్పి రాత్రి ఓ చోట చుట్టూ కంచె వేసి గొర్రెలను ఉంచుతారు. తాము ఇంటి నుంచి వచ్చేటప్పుడు తమకు ఆహారం వండుకోవడానికి వంట పాత్రలు, ఇతర సామగ్రిని గుర్రాలపై వేసుకుని ప్రయాణం సాగిస్తారు. ఎక్కడయితే బస చేస్తారో ఆ ప్రాంతంలో ఉదయం పూటే వండుకుని పగలు రాత్రి ఆ ఆహారాన్నే తింటారు. ఒక వేళ ఎవరైనా రైతులు ఎరువు కోసం అవసరం అనుకుంటారో వారే గొర్రె మందల యజమానికి బియ్యం ఇతర వస్తువులు ఇచ్చి గొర్రెలను తమ చేలో ఉంచమని చెబుతారు. ఇలా ఆరునెలల పాటు ఇతర ప్రాంతాల్లో వలస అనంతరం తమ ప్రాంతంలో వర్షాలు కురిసి మేత రాగానే గొర్రెలతో పాటు తమ ఇండ్లకు చేరు కుంటారు.



మేత కోసం వలస వస్తున్న గొర్రెల మంద

మేత దొరకక జుక్కల్‌కు వలస వచ్చాం..

● ఐలయ్య, గొర్రెల యజమాని



గత నెల రోజుల కిందట వరకు మా మండలంలో జీవాలకు విరివిగా మేత లభించింది. దీంతో ఇన్నాళ్ల పాటు అక్కడే గొర్రెలను మేపుకున్నాం. ప్రస్తుతం మా ప్రాంతంలో మేత దొరకక పోవడంతో జుక్కల్ ప్రాంతానికి వలస వచ్చాం. ఇక్కడ ఇప్పుడిప్పుడే పంటలు పూర్తవుతున్నాయి. దీంతో మా జీవాలకు మేత లభిస్తుంది. తిరిగి వర్షాలు కురిసి మా ప్రాంతంలో మేత రాగానే ఇక్కడి నుండి వెళ్లిపోతాం.

మేత దొరికేంత వరకు ఇక్కడే ఉంటాం..

● మల్లయ్య, గొర్రెల యజమాని



మా గ్రామంతో పాటు పెద్ద మల్లారెడ్డి, మెదక్ జిల్లా రామాయంపేట్ మండలం అక్కన్నపేట్ గ్రామాలకు చెందిన గొర్రెలను తీసుకుని మేత కోసం జుక్కల్ ప్రాంతానికి వలస వచ్చాం. ముందుగా మాలో ఒకరు ఏ ప్రాంతంలో జీవాలకు మేత సమృద్ధిగా ఉందో చూసి రాగానే అక్కడ టికానా వేస్తాం. మేత దొరికేంత వరకు ఇక్కడే ఉండి మేత పూర్తి కాగానే ఈ ప్రాంతం నుంచి మరో చోటికి వెళ్తాం. ఆరు నెలల పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ వీటినే సాదు కుంటూ జీవిస్తాం.

ప్లాస్టిక్‌ను నానో కణాలతో తయారు చేయొచ్చు

● దక్షిణ కొరియా ప్రొఫెసర్ గంగారాజు


టీయూలో మాట్లాడుతున్న కొరియా ప్రొఫెసర్ గంగారాజు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగంలో గురువారం దక్షిణ కొరియా ప్రొఫెసర్ గంగారాజు బయో మెడికల్ రీసర్చ్ అంశంపై మాట్లాడుతూ.. కాలుష్యం లేని ప్లాస్టిక్‌ను నానో కణాలను ఉపయోగించి తయారు చేయ వచ్చునని దీని ద్వారా కాలుష్యం లేని ప్లాస్టిక్ వస్తుందన్నారు. వివిధ వ్యాధులకు సంబంధించి స్కానింగ్‌కు కూడా నానో కణాలు అద్భుతంగా పని చేస్తాయని పేర్కొన్నారు. ఒక ఔషధం శరీరంలో ఒక వ్యాధికి సంబంధించిన టార్గెట్‌ను చేయడానికి అత్యంత ప్రభావితంగా పనిచేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా డా.గంగారాజు ను వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో డా.నాగ రాజు, బాలకిషన్ గంగాకిషన్,మహేందర్, సత్యనారాయణ, వాసం చంద్రశేఖర్, ప్రవీన్, సత్యనారాయణ, కిరాణ్మయి, రాజేశ్వరి, డేనియల్, సురేశ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాలలో విద్యార్థులకు మౌఖిక పరీక్షలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో గురువారం 5వ సెమిస్టర్ విద్యార్థులకు కోర్సులో భాగంగా అల్టార్‌నెటివ్ డిస్ప్యూట్ రిసోల్యూషన్ అంశంపై గురువారం మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఎక్స్‌టర్నల్‌గా న్యాయవాది రామాగౌడ్ హాజరయ్యారు. ఇంటర్నల్ ఎక్సామినార్ గా లా కళాశాల విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా.స్రవంతి వ్యవహరించారు. జట్లింగ్ ఎల్లోసా, నాగజ్యోతి, విద్యార్థులు, పాల్గొన్నారు.

బడాపహాడ్ టెండర్‌లో గోల్‌మాల్

● రూ.4.72కోట్లకు టెండర్ అయినా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే బాధ్యతలు
● వేసిన టెండర్ రద్దు చేశారని బాధితుల మొర ● హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

వర్ని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన బడాపహాడ్(పెద్దగుట్ట)నిర్వహణ బాధ్యతలు దోపిడికి నిలయంగా మారాయి. ఒక ఏడాది పాటు వక్ఫ్‌బోర్డు సిబ్బంది కబంద వలయంలో కోట్ల రూపాయల చేతులు మారగా ప్రస్తుతం అందుకు భిన్నంగా ఇతర వ్యక్తులు వేసిన టెండర్ మాయమైపోయింది. గత డిసెంబర్ నెల 28న రూ.4.72కోట్లకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో టెండర్ కాగా ఇప్పటికి ఆ టెండర్ ప్రక్రియ మొదలు కాలేదు. కొందరి దుందుడుకు తనం, భక్తుల నిలువు దోపిడితో పాటు వేసిన టెండర్‌కు డబ్బులు కట్టని కారణంగా జనవరి 29న టెండర్ రద్దయింది. దీంతో జావిద్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. వక్ఫ్‌బోర్డు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అప్పటి నుంచి దోపిడిదారులకు నిలయంగా బడాపహాడ్ నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్ వ్యక్తులకు వరంగా మారాయి. 2025-26ఏడాదికి గానూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు దినసరి ఆదాయం రూ.12.9లక్షలు సమకూరాలి. ఇంతటి పెద్ద మొత్తంలో రావాల్సిన ఆదాయంకు గండి కొట్టడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం వక్ఫ్‌బోర్డు సిబ్బంది జులుం ప్రదర్శించి ప్రైవేట్ వ్యక్తులను మచ్చిక చేసుకొని ఇష్టారాజ్యంగా నిలువు దోపిడికి గురి చేస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇకనైనా జిల్లా కలెక్టర్ బడాపహాడ్ వ్యవహారంలో విచారణ జరిపి హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా టెండర్ ప్రక్రియ కొనసాగించాలని కోరుతున్నారు.


బడాపహాడ్‌లోని దర్గా

● టెండర్ రద్దయిన వ్యక్తులకే బాధ్యతలా..!?

బడాపహాడ్ నిర్వహణలో రూ.4.72కోట్లకు టెండర్ వేసిన వ్యక్తులు వక్ఫ్‌బోర్డుకు డబ్బులు చెల్లించకపోగా అదే వ్యక్తులు నిర్వహణ బాధ్యతలు చూడటం పలు విమర్శలకు దారి తీస్తోంది. టెండర్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎలా డబ్బులు ఎగనామం పెట్టిన వారికి వత్తాసు పలుకుతారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. జరిగిన లోపాలను సరిదిద్ది జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ స్థాయి సీనియర్ ఉమెన్స్ కబడ్డీ జట్టుకు గోదావరి ఎంపిక

ఏర్గట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బట్టాపూర్ గ్రామానికి మూడ్ గోధావరి జాతీయ స్థాయి సీనియర్ ఉమెన్స్ జట్టుకు ఎంపికైంది. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నెల 15 నుంచి 18 వరకు హర్యానలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ ఉమెన్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనున్నట్లు జిల్లా కోచ్ మీసాల ప్రశాంత్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికైన గోదావరికి కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగయ్య, బట్టాపూర్ గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు టీయూ అధ్యాపకుడు ఎంపిక


బీఆర్ నేత (ఫైల్)

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బీఆర్ నేతా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యూకేషన్ అండ్ స్పోర్ట్స్ -2025కు చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 15, 16వ తేదీల్లో హైదరాబాద్‌లోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొననున్నారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు చైర్మన్‌గా వ్యవహరించేందుకు అవకాశం కల్పించిన టీయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలకు బీఆర్ నేతా ధన్యవాదలు తెలిపారు. యూని వర్సిటీలోని విద్యార్థులు, అధ్యాపకులు బీఆర్ నేతాకు అభినందలను తెలుపుతూ సన్మానాలు చేశారు.

ప్రేమ ఎంత మధురం

• రెండక్షరాలు.. నూరేళ్ల జీవితం • ఏళ్లు గడిచినా చెరిగిపోని ప్రేమ బంధం
• జిల్లాలో ఆదర్శ ప్రేమికులు ఎందరో • నేడు ప్రేమికుల దినం

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

ప్రేమ రెండు అక్షరాలు...రెండు హృదయాలు.. ఇద్దరు మనుషులు.. ప్రేమ ఒక ధైర్యం.. ఒక సాహసం.. చూపులు కలిసి...మనస్సులు ఒక్కటై జీవిత భాగస్వాములుగా కలకలం జీవించేందుకు పునాది వేస్తుంది. ఆ జీవన ప్రయాణంలో ఏండ్లు గడిచిన...ఇంకా కొత్తగానే అనిపిస్తోంది. ఈ మధుర స్మృత్రులను కలకలం గుర్తుండేలా చేస్తుంది. ఇలా కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ప్రేమ పెళ్లిలు చేసుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు. చదువుకునే రోజుల్లో క్లాస్ రూములలో మొదలైన ప్రేమను కలకలం నింపుకుని ఆనందంగా గడుపుతున్నారు. ప్రేమ ఎంత మధురమో జీవితంలో స్థిరపడడం అంతే ముఖ్యమంటూ సూచిస్తున్నారు. ప్రస్తుతం టీనేజ్ యువత ఆకర్షణను ప్రేమ అనుకుంటూ జీవితంలో దారి తప్పుతున్నారని పలువురు హెచ్చరిస్తుండగా స్వచ్ఛమైన ప్రేమ కలకలం నిలుస్తుందని మరికొందరు సూచిస్తున్నారు. నేడు ప్రేమికుల దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ప్రాంతాలు వేరైనా మనసులు ఒక్కటై..

● సల్మెడ అనిల్,ఆదిలక్ష్మిదంపతులు



2012లో తాను హైదరాబాద్‌లో బీటెక్ చదువుకునే సమయంలో నా జీవిత భాగస్వామి ఆది లక్ష్మీ హైదరాబాద్‌లో ఎం బీఏ చేస్తున్న సమయంలో పరిచయమైంది. ఇరు వురి మధ్య మూడేండ్లు ప్రేమ కొనసాగగా ఇరు కుటుంబాలను ఒప్పించి 2015లో వివాహం చేసుకున్నాం. ప్రస్తుతం లింగంపేట మండలంలో విద్యుత్‌శాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ప్రాంతాలు వేరైన మా మనస్సులు ఒక్కటవడం, స్వచ్ఛమైన ప్రేమకు కుటుంబాలు సైతం ఒప్పుకోవడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గత 10 ఏళ్లుగా అన్యోన్యంగా జీవనం కొనసాగిస్తున్నాం. ప్రేమించడంతో పాటు ఇరుకుటుంబాలను ఒప్పించి పెళ్లిచేసుకోవాలనేది మా అభిప్రాయం.

మాది కులాంతర వివాహం

● మర్కం శ్రీనివాస్,సుజాత దంపతులు



మా ప్రేమ వివాహనికి 25 ఏళ్లు పూర్తికావస్తుంది. మా ఇద్దరి కులాలు వేరైనా 2000ల సంవత్సరంలో నా జీవిత భాగస్వామి సుజాతను వివాహం చేసుకున్నాను. అప్పటినుంచి ఒక్కరికొక్కరం అర్థం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇద్దరిలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అని ఏరోజు ఫీల్ కాలేదు. మా జీవితం అందంగా ఉంది కాబట్టి ప్రేమ వివాహం బెస్ట్ అని మా అభిప్రాయం.

ప్రేమ వివాహంతో పాటు జీవితాన్ని నిలబెట్టుకోవాలి

● ఆంజనేయులు, మీనా దంపతులు



మా ఇరువురిది దోమకొండ మండలం గొట్టిముక్కుల గ్రామం. నా జీవితభాగస్వామి మీనాను ప్రేమించి 5 ఏళ్ల కిందట వివాహం చేసుకున్నాను. ప్రస్తుతం ప్రైవేట్ జాబ్‌చేస్తు ఆనందంగా మా జీవనం సాగిస్తున్నాం. ప్రేమించడంతో పాటు మనను నమ్ముకుని వచ్చిన వారికి మంచి జీవితాన్ని అందించాలి. ఒకరికొకరు అర్థం చేసుకోవడంతో పాటు ప్రేమించిన వారు తమ జీవితంలోకి రావడం అంటే ఎంతో అదృష్టం చేసుకుని ఉండాలి. ఆ అదృష్టాన్ని మూణ్నాళ్లకే మూలకు చేరేలా చేసుకోకుండా ఒకరినొకరు అర్థం చేసుకుని జీవనం సాగించాలి.



సమ సమాజ స్థాపన కోసం అడుగులు వేశాం

● సురేష్,హేమలత దంపతులు

తాను ఇంటర్ రెండో సంవత్సరం నుంచి ప్రగతి శీల ఆలోచనలు, భావాలు కలిగి ఉండి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో పనిచేస్తున్నాను. కుల రహిత, మత రహిత సమ సమాజ స్థాపన కోసం పనిచేస్తున్న సందర్భంలో అలాంటి ఆలోచనలు కలిగిన హేమలత నాకు పరిచయం అయింది. ఐదుసంవత్సరాలు మంచి స్నేహితులుగా ఉండి ఒకరిని ఒకరం అర్థంచేసుకుని ఏడో సంవత్సరంలో మా పార్టీ పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాం. ఆనాటి నుండి నేటి వరకు కుటుంబాలపై ఆధారపడకుండా మాకు మేముగా ఉన్నత చదువులు చదువుతూ ఆదర్శంగా ఉంటూ పేద, మధ్య తరగతి విద్యార్థుల హక్కులకోసం పోరాటాలు నిర్వహిస్తున్నాను. నా జీవిత భాగస్వామి హేమలత పీజీ, స్కూల్ ఎడ్యూకేషన్ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తుంది. ఈ ఫిబ్రవరి 9కి మా ప్రేమకు దశాబ్దికాలం పూర్తయింది.



పోటీలో గెలుపొందిన విద్యార్థులు

గుండారం పాఠశాలలో 'ఆంగ్ల దినోత్సవం'

మోపాల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భారత కోకిల, తెలుగువారి ఆడపడుచు సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవాన్ని గురువారం గుండారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బి.అమర్‌నాథ్ మాట్లాడుతూ... ఆంగ్ల సాహిత్యానికి భారత స్వాతంత్ర్యోద్యమానికి సరోజినీనాయుడు చేసిన కృషిని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు గిరిధర్, ఆరోగ్య రాజ్‌లు ఆంగ్ల భాషా ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ తయారీ, స్టోరీ టెల్లింగ్, కవితా పఠన పోటీలను నిర్వహించి పోటీలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని లేదంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రూ.4650 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక చదువుకు దూరమవుతున్నారని అన్నారు. ఒకవైపు పరీక్షలు దగ్గరపడుతుంటే ఫీజుభారం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆయన అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో పూర్తి ఫీజులు చెల్లిస్తామని, బీసీ విద్యార్థులకు షరతులు లేని విద్యను అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ ఏడాది గడిచిన బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. మెడికల్ సీట్ల కేటాయింపులోనూ బి మరియు సీ కేటగిరిలో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని మొదట ఓపెన్ కేటగిరి పిలిచిన తర్వాతనే రోస్టర్ ప్రకారం రిజర్వేషన్‌లు విద్యార్థులను ప్రవేశాల ద్వారా తీసుకోవాలన్నారు. పది రోజుల్లో పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ అదే విధంగా సచివాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు బుస్స ఆంజనేయులు, కొయ్యాడ శంకర్, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ముగిసిన అంతర్గత క్రీడలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయ్ హైస్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 27వ అంతర్గత క్రీడల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ విష్ణు పి.నాయర్, విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు అమృతలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్నల్ విష్ణు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9, 10వ తరగతి విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో చేసిన సైనికుల కవాతును తలపించిందన్నారు. చదువుతో పాటు ఆటలకు ప్రాముఖ్యం ఇవ్వాలని ఉపాధ్యాయులు చూపిన మార్గంలో విద్యార్థులు నడవాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐడియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యురాలు సునిత, ప్రభాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఎమ్మెల్సీపై బీజేపీ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీ ఎస్ఎస్ ప్రభాకర్, మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఆకుల విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ తపాస్ బలపర్చిన మల్క కొమరయ్యను గెలిపించడానికి కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో కొండ ఆశన్న, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్‌లో పీజీ సీటు సాధించిన డాక్టర్ రాంచందర్‌కు సన్మానం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 62 ఏళ్ల వయస్సులో నిత్య విద్యార్థిగా మెడిసిన్‌లో పీజీ సీటు సాధించిన ప్రముఖ పిల్లల వైద్యుడు నీలి రాంచందర్‌ను గురువారం రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ దయాకర్‌గౌడ్, ప్రముఖ వైద్యుడు జలగం తిరుపతిరావు తదితరులు ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ అయ్యే వయస్సులో అందరూ విశ్రాంతి తీసుకోవాల నుకునే సమయంలో నేటి యువతకు ఆదర్శనీయంగా డాక్టర్ రాంచందర్ పీజీ సీటు సాధించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు డాక్టర్ జమాల్‌పూర్ రాజశేఖర్, న్యాయవాది ముత్యాల శ్యామ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

'టీఎస్ పేట' ఉపాధ్యక్ష పదవికి రాజేశ్వర్ రాజీనామా

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): టీఎస్ పేట ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ పేట కాలపరిమితి పూర్తయినందున పదవిలో కొనసాగడం సమంజసం కాదని భావించి ఉపాధ్యక్ష పదవి బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన తెలిపారు. తన రాజీనామాను అధ్యక్షుడు ఆమోదించాలని రాజేశ్వర్ కోరారు.





జానకంపేటలో కుస్తీ పడుతున్న మల్ల యోధులు

జానకంపేటలో కుస్తీ పోటీలు

ఎడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాలలో చివరి రోజున కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, అదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాల ముగింపు రోజున కుస్తీ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 5వ తేదీన మొదలైన బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయని తెలిపారు. కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందించడం జరిగిందన్నారు. జిల్లా నుంచే కాకుండా, మహారాష్ట్ర రాష్ట్రం నుంచి మల్ల యోధులు వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారని వారు తెలిపారు.

గల్ఫ్ కార్మికుల వలసలపై అధ్యయనం

(ఐదో పేజీ తరువాయి)

గల్ఫ్ దేశాలకు జిల్లా నుంచి ఎక్కువ మంది వలసలు వెళ్లడం వల్ల వారికి ఉపాధి కల్పించే విధంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రెండేళ్ల పాటు నాలుగు గ్రామాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి కావాల్సిన నిధులను ఈ సంస్థలు పెట్టనున్నాయి. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా ఇతర జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీమ్‌రెడ్డి తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసమే ఈ కార్యక్రమాలు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలతో కలిసి చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాలకు ఐక్యరాజ్యసమితి, అనుబంధ సంస్థలు ముందుకు రావడం జిల్లాలోని గల్ఫ్ కార్మికులకు మేలు చేస్తాయని ఆయన తెలిపారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకస్మికంగా శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బందికి, మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. నగరంలో ఎప్పటికప్పుడు చెత్తను తీసివేయాలని తీసివేసిన చెత్తను డంపింగ్ యార్డుకు పంపాలన్నారు. నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డ్రైనేజీలను సైతం ఎప్పటికప్పుడు తీసివేయాలన్నారు. తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫిషరిష్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన సన్మానం



చైర్మన్ సాయికుమార్‌ను సన్మానిస్తున్న జీజీ ఫౌండేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీజీ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఫిషరిష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు ఘనంగా సన్మానించారు. పట్టణానికి విచ్చేసిన ఆయనను జీజీ ఫౌండేషన్ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికి శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్ గుజరాతి, డీజె దయానంద్, నారాయణవర్మ, కాశీనాథ్, సునీల్, జోచ్‌కర్ వేణు, బింగి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటో బోల్తా

● విద్యార్థులకు గాయాలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుభాష్‌నగర్‌లో స్కూల్ ఆటో బోల్తా పడి ఇద్దరు విద్యార్థులు గాయపడిన ఘటన గురువారం జరిగింది. నగరంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న షేక్ షైమద్, వినీత్ నందాలతో పాటు మరికొంత మంది విద్యార్థులు స్కూల్ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ఆటో బోల్తా పడగా ఇద్దరు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి గాయపడిన షేక్ షైమద్, వినీత్‌లను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

వర్గీకరణ పేరుతో దళితులను విడదీయడం సరైన పద్ధతి కాదు

● మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో దళితులను విడదీయడం సరైన పద్ధతి కాదని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు నీరడి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాలమహానాడు పార్టీ కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరడి లక్ష్మణ్ మాట్లాడుతూ.. మనువాద ప్రభుత్వాలు దళితులను విడదీసి రాజ్యాంగాన్ని అణచివేయడానికి చూస్తుందన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని తెరపైకి తీసుకువచ్చి బహుజనులకు విద్య, ఉద్యోగ అవకాశాలను తొలగించాలని కుట్రలు చేస్తుందన్నారు. ప్రభుత్వాలు మారకపోతే భవిష్యత్తులో ఈ మనువాద ప్రభుత్వాల మనుగడ ఉండదని హెచ్చరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీలను వర్గీకరిస్తూ బిల్లును ప్రతిపాదించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మాలలంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు చంద్రశేఖర్, అధికార ప్రతినిధి టీఎస్ రమేష్, గౌరవ సలహాదారులు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

మోపాల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారత, జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నిజామాబాద్ జిల్లా, నిజామాబాద్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బోర్గాం(పి) అంగన్‌వాడీ సెంటర్, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ.. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం యొక్క థీమ్‌ను ఉద్దేశించి ఎంపవరింగ్ ద గర్ల్స్ ఫర్ బ్రైట్ ఫ్యూచర్ అంటూ బేటీ బచావో బేటీ పఢావో అనే ఐదు ఉద్దేశాలను తెలుపుతుందని వివరించారు. ఆడపిల్లల యొక్క లింగ నిష్పత్తిని పెంచడం, లింగ నిష్పత్తిని తగ్గుదలను అరికట్టాలని అన్నారు. ఆడపిల్లలు మగ పిల్లలు సమాజంలో సమానమని తెలుపుతూ ఇద్దరికి కూడా మానవ హక్కులు ఉన్నాయని తెలిపారు. శిశు భ్రూణ హత్యలు జరగకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. అలాగే పిల్లలపై జరిగే అఘాయిత్యాలు జరగకుండా వాటిని తగ్గించడం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యం ఎందుకు తగ్గుతుందంటే చిన్న తనంలోనే పెళ్లిళ్లు చేయడం ద్వారా భ్రూణ హత్యలకు పాల్పడడం ద్వారా అఘాయిత్యాల వల్ల ఆడపిల్లలు మరణాలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్, మెడికల్ ఆఫీసర్ సంతోష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, సువర్ణ, హేమలత, లావణ్య పాల్గొన్నారు.

జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఈ నెల 28న జరిగే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకుడు రామకృష్ణ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా మతంపేరిట బీజేపీ చిచ్చుపెడుతుందన్నారు. ప్రజలు సంఘటితంగా పాసిస్ట్, మతవాత రాజకీయ పార్టీ అయిన బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేష్, నాయకులు ప్రకాష్, అనిస్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం

13 మంది నామినేషన్ల ఉపసంహరణ ● బరిలో 71 మంది అభ్యర్థులు

పట్టభద్రుల స్థానానికి 56 మంది ● ఉపాధ్యాయ స్థానంలో 15 మంది పోటీ

కరీంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. గురువారం 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఉపసంహరణ అనంతరం 71 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది పోటీ చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 100 నామినేషన్లు దాఖలు కాగా 32 నామినేషన్లను స్క్రూటినిలో తిరస్కరించారు. పట్టభద్రుల స్థానంలో 13 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అలాగే ఉపాధ్యాయ స్థానానికి 17 నామినేషన్లు వచ్చాయి. వాటిలో ఒక నామినేషన్‌ను స్క్రూటినీలో తిరస్కరించారు. ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోగా చివరకు 15 మంది పోటీలో ఉన్నారు. ఈనెల 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా చినమైల్ అంజిరెడ్డి, బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ, ఆలిండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా లంటు చంద్రశేఖర్, తెలంగాణ ప్రజా శక్తి పార్టీ అభ్యర్థిగా దొడ్ల వెంకటేశం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా బక్క జడ్సన్, ధర్మసమాజ్‌పార్టీ అభ్యర్థిగా మంద జ్యోతి, తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ అభ్యర్థిగా బొల్లి సుభాష్, నేషనల్ నవ క్రాంతి పార్టీ అభ్యర్థిగా సిలివేరు ఇంద్రగౌడ్ పోటీలో ఉన్నారు. వీరితో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ట్రస్మా రాష్ట్ర మాజీ చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు, ముస్తాక్ అలీ, మరో 44 మంది ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా మల్క కొమురయ్య, బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా యాటకారి సాయన్న, దళిత బహుజన్ పార్టీ అభ్యర్థి గవ్వల లక్ష్మి, ఇండిపెండెంట్లుగా వై. అశోక్‌కుమార్, కంటె సాయన్న, కూర రఘోత్తంరెడ్డి, చాలిక చంద్రశేఖర్, జగ్గు మల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, ముత్తారం నర్సింహస్వామి, వంగ మహేందర్‌రెడ్డి, జర్నలిస్టు విక్రమ్‌రెడ్డి వేముల, సిలివేరు శ్రీకాంత్, ఎల్.సుహాసిని పోటీలో ఉన్నారు.

తెలంగాణ సివిల్ సర్వీసెస్ హాకీ జట్టు సారథులుగా జిల్లా వాసులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సివిల్ సర్వీసెస్ హాకీ జట్టు సారథులుగా డాక్టర్ స్వామికుమార్, స్వప్న ఎంపికయ్యారు. ఈ నెల 15 నుంచి 28 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ పట్టణంలో ఈ పోటీలు జరగనున్నాయి. మహిళా జట్టుకు సారథిగా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా నిర్వహిస్తున్నటువంటి స్వప్న, పురుషుల జట్టు సారథిగా జాకోరా పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామికుమార్ ఎంపికయ్యారు. జిల్లా వాసులు రాష్ట్ర జట్టుకు సారథులుగా ఎంపిక కావడం పట్ల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు అండర్-14 విభాగంలో జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈనెల 13 నుంచి మహారాష్ట్రలోని శంబాజీనగర్‌లోగ జరుగుతున్న 68వ జాతీయ స్థాయి పోటీలో వీరు పాల్గొననున్నారు. బాలుర విభాగంలో వర్షిత్, నిహాల్ చంద్ర, నివార్, బాలికల విభాగంలో అహల్య, వర్షిణి, నిహారిక, సమన్వితలు పాల్గొంటున్నారని తెలిపారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ..



పోటీలకు ఎంపికైన గోదావరి

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారిణి గోదావరి ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ తెలిపారు. సీనియర్ కబడ్డీ పోటీలో గోదావరి పాల్గొననుంది. ప్రస్తుతం గోదావరి స్పోర్ట్స్ కోటాలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తుంది. సీనియర్ జాతీయ స్థాయి పోటీలు హర్యానాలో జరగనున్నాయి. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లింగయ్య, గంగాధర్‌లు హర్షం వ్యక్తం చేశారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

మోపాల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలు, రైతాంగ ప్రజాసమస్యల పరిష్కారానికి ఈనెల 20న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. గురువారం మోపాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు అందని ద్రాక్షలాగా మారిందని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా ఏ పథకాలు ప్రారంభం కాలేదని వీటితో పాటు రైతాంగ ప్రజాసమస్యల పరిష్కారంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ప్రజలకు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్ చేస్తుందని అన్నారు. 20న జరగబోయే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అగ్గు ఎర్రన్న, చిన్నయ్య, రజినీకాంత్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంతిరెడ్డి రాజరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, బాపూజీ వచనాలయ ప్రధాన కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, సిరికొండ గంగారెడ్డి తదితరులు గురువారం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88300	రూ.81500	రూ.995


సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1: కెప్టెన్ అమెరికా(తెలుగు3డి)(10.45, 7.20)
: లైలా (1.25) : తండేల్ (4.15, 10.00)
స్క్రీన్-2:చావా (హిందీ)(10.00, 4.00, 10.25)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.20)
: తండేల్ (7.20)
స్క్రీన్-3 : తండేల్ (10.30)
: నిదిరించు జహాపనా (1.35)
: లైలా (4.10): చావా (హిందీ) (7.00)
: సనం తేరీ కసమ్ (హిందీ) (10.20)
స్క్రీన్-4 : తాలా (10.55)
: సంక్రాంతికి వస్తున్నాం (1.35, 7.40)
: బ్రహ్మా ఆనందం (4.35) : లైలా (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1:చావా (హిందీ) (11.00, 1.40, 10.20)
: తండేల్ (4.35, 7.30)
స్క్రీన్-2 : లైలా (11.00, 1.40, 7.20, 10.20)
: చావా (హిందీ) (4.30)
స్క్రీన్-3 : బ్రహ్మా ఆనందం (11.00, 4.30)
: ఆరేంజ్ (1.40)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డీ) (7.40)
: తండేల్ (10.25)



దేవి: లైలా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్